# తనసొమ్ము కాకపోతే

"ఇంకో రెండు లడ్డూలు!"

"అబ్బెబ్బే—వద్దండీ."

"అదేమరి. ఇలాంటి సమయాల్లో కాకపోతే మరెప్పుడూ మేం వెయ్యటమున్నా, మీరు వేయించుకోవటమున్నా" అంటూ వెంకూబాయమ్మగారు ఛడాలున రెండు లడ్డూలు అతగాడి విస్తట్లో వడ్డించి చక్కా పోయింది.

అవధాన్లు సంతోషించాడు యీఆదరణకు. కడుపులో ఖాళీచేసుకుని లడ్డూల పని పట్టించాడు.

అటుప్రక్కన కూర్చున్న శాస్త్రులుగారూ, యిటువైపు కూర్చున్న శర్మగారూ అదేపనిలో మునిగివున్నారు. ఈ ముగ్గురేకాదు అక్కడ వుంట. ఆ పెళ్ళిపందిరిలో చాలామంది వున్నారింకా.

మరో నిమిషం గడిచాక వెంకాయమ్మగారు మళ్ళీ వచ్చింది నెయ్యిచెంబు పట్టుకుని. అవధాన్ల దగ్గరికొచ్చి చేతిలో చారడు పోసింది.

'అయ్యో, ఎందుకండీ యింత "అని అవధాన్లు కంగారు పడ్డాడు.

"అదే వద్దంట. నెయ్యికంటే అసలు రుచేలేదు. యింకా స......" అంటూ మరి కొంచం గుమ్మరించి ప్రక్కన కూచున్నవారికి కూడా వడ్డించుకుంటూ ముందుకు సాగి పోయిం దావిడ. అందరూ సంతప్తులయారు ఆవిడ వడ్డనకు. కూచున్న వాళ్ళందరి నోర్లలోనూ ఆవిడపేరు గిరగిరా తిరిగింది.

"నిజంగా వడ్డనకు వెంకాయమ్మగారి పేరే చెప్పుకో వాలి. అందరూ అలా వుండమన్నా వుంటారా మరి! ఆవిడ తీరేవేరు" అన్నాడు అవధాన్లు నోట్లోకి ముద్ద బలవంతంగా తోస్తూ.

ప్రక్కనున్న శాస్త్రిలుని యీమాట బాగా ఆకర్షించింది. "భేషయినమాట పలికారు. నేతితో చేతులు తడిసి పోయాయంటే నమ్మండీ. ఎంత దర్జా, ఎంత వినయం:" అంటూ సంతకలిపి చేవుమని త్రేన్చుకున్నాడు.

"ఈ వడ్డిస్తున్న వాళ్ళలోనే మిగతావాళ్ళకీ ఆవిడకూ బేధం చూశారా?"

"చూడకేం? నిక్షేపంలా."

శర్మకూ ఒకమాట విసరాలని బుద్ధి పుట్టింది. "చూశారూ? మొన్న రాజమ్మగారింట్లో పెళ్ళికి వెళ్ళాను. నెయ్యి పట్టుకొచ్చి ఒక్కబొట్టు రాల్చి పోయేవారు. కూరలు మారడిగితే ఏడ్చుకునే వారంటే నమ్మండి, అన్నం బటా బటగా సరిపెట్టారు. అన్నట్టు శాస్త్రిలుగారుకూడా వున్నారుగా అప్పుడు" అన్నాడు యిద్దరి మొహాలవంకా చూస్తూ.

"సరిసరి. నేను లేకపోవటమేమిటి! ఈ అన్యాయ మేమిటని విప్లవం లేవతీసింది నేనుగానూ? అయినా వాళ్ళకూ, యీావిడకూ సంబంధ మేమిటి? ఈవిడ చెయ్యి ఎంత భారీదో లెక్కలేదు" అని జవాబు చెప్పాడు శాస్త్రిలు.

"అంతేనంటె అంతే" నన్నారు యిద్దరూ.

"అయితేనీా పెళ్ళికూతురి తల్లికి వెంకూబాయమ్మ గారు ఏమవుతారో కాస్త విడమర్చి చేస్తాడు!" అనడిగాడు శర్మ.

"దానికేం? పెళ్ళికుమార్తె తల్లికి అంటే దుర్గాబాయమ్మగారికి యీావిడ మేనత్తగారి కోడలికి ఆడబడు చవుతుందిట" అని చెప్పాడు అవధాన్లు.

"ఓహోఁ అలాగా"

ఈసారి వెంకూబాయమ్మగారు గోంగూర పచ్చడి పట్టుకు వచ్చింది. "ఆంధ్రమాత వద్ద నేరుసుమండీ. తప్పు" అంటూ ఒక్కొక్క విస్తట్లో యింతంత వేయసాగింది.

"ఇంతింత వద్దండి బాబూ, అనవసరంగా పారవేయవలసి వస్తుంది" అని గోల పెట్టారు కొందరు బుద్ధిమంతులు.

"ఈకా స్తకే? తినగలిగినంత తినండి, మిగిలింది పారేయండి. మరేం భయంలేదు" అని హామీ పలికింది ఆవిడ. అప్పుడే వచ్చి పందినంతా పరకాయించి చూస్తున్న దుర్గాబాయమ్మ గారికి కొంచం కష్టం కలిగింది_ యీ దృశ్యం చూసి.

"పోనీలెండి వెంకూబాయమ్మగారూ, వద్దంటుంటే అంత బలవంతం దేనికి?" అన్నది ప్రాణం పీకి.

వెంకూబాయమ్మగారు కొంచం చిన్నబుచ్చుకుని, "పోనీలేవమ్మా రోజూ పండుగే అవుతుందా ? యిలాంటప్పుడు కాకపోతే మరెప్పుడు మనం పెట్టినా తిన్నా కూడాను"అన్నది.

"అదిగాదు నేను చెప్పేది. అసలేకరువురోజులుచూడండి వస్తువు వృథాచేయటం అంత మంచి పద్ధతికాదు అని చెప్తూంట" అని దుర్గాబాయమ్మగారు అక్కడినుంచి వెళ్ళి పోయింది. ఆవిడ ఆమాటే యిద్దరి ముగ్గురికి చెప్తూండటం అవధాన్లు ప్రభృతులకూ, వెంకూబాయమ్మగారికి కూడా వినిపించింది.

"ఒకరి సొమ్మని నా కేమయినా చుల్కన ఏమన్నా నా అందరి సంతోషం నా సంతోషం లాగే భావించాను కాని" అన్నది వెంకూబాయమ్మగారు.

"అంతేనండి గిట్టనివాళ్లు అనేకవిధాలుగా అనుకుం టారు. మీ విషయం ఎవరికి తెలియనిది చెప్పండీ?" అని సముదాయించాడు అవధాన్లు.

"మీరు కాబట్టి ఆలాగంటారునాయనా? నన్ను సరిగ్గా అర్థంచేసుకునేవాళ్ళు కొంతమంది వుంటారంటావు?" అని ఆవిడ వెళ్ళిపోయింది.

"దుర్గాబాయమ్మగారు వట్టి పిసినారి" అన్నాడు శాస్త్రులు మెల్లిగా.

"పిసినారంటే పిసినారా? మాయింట్లో పెళ్ళిల్లో ఆవిడ పెత్తనమేమిటంటా?_ అని గొణుక్కున్నది. వెంకూబాయమ్మ గారికి ఎంతకష్టం కల్గిందో ఏమిటో" అని సానుభూతి చూపించాడు శర్మ.

"అన్నట్లు, వెంకూబాయమ్మగారికి పెళ్ళీడుకొచ్చిన కూతురొకామే వుందికదూ?" అన్నాడు శాస్త్రులు.

"అవునవును. యింతకీ ఆ అమ్మాయి పెళ్ళెప్పుడో!" అన్నా డవధాన్లు. అని వెంకూబాయమ్మగారి కోసం ఎదురు చూశాడు. మరోనిమిషానికల్లా ఆవిడ రానేవచ్చింది.

ఆవిడ నెయ్యివడ్డిస్తూవుండగా "చూశారూ వెంకూ బాయమ్మగారూ, మీకు పెళ్ళీడు కొచ్చిన కుమార్తెవున్నది ఆ అమ్మాయి పెళ్ళెప్పుడు?" అనడిగాడు.

"మా సుభద్రా బాబూ! ఏదీ సంబంధాలకోసం గాలిస్తున్నాం. ఒక్కటయినా కుదిర్తేనా? ఎంతెంత వాళ్ళకీ వేలకు వేలు కట్నాలు పొయ్యాలిబాబూ, మాటలా"–అంది.

"ఏదో, అదికూడా త్వరగా జరిగిపోయేటట్లు చూడండి, మా అందరికీ మళ్ళీ పప్పన్నాలు."

"అయ్యో అంతకంటేనా?"

వెంకూబాయమ్మగారు వెళ్ళిపోయింతర్వాత ముగ్గురూ ఆ విషయమే ముచ్చటించారు. ఆవిడ వినయానికి విస్తుపో

యారు. ఆవిడకు సాటి ఆవిడే నన్నారు. యింకా యేమి టేమిటో అనుకున్నారు.

ఆరోజు జరిగిన మిగతా విషయాల్తో మనకి ప్రసక్తి లేదు.

*　*　*

అ తర్వాత ముచ్చటగా మూడునెల్లయినా గడవక ముందే వెంకూబాయమ్మగారి కూతురికి పెళ్ళి కుదిరింది. కుదరట మేమిటి? జరిగిపోతూన్నది.

మిగతా విషయాల సంగతి మన కెందుకుగాని ఆరోజు భోజనాల దగ్గిర ఏమయిందో చూద్దాం.

ఈసారికూడా అవధాన్లు మధ్యను బైటాయించాడు. అతనికి యిరుప్రక్కలా శాస్త్రుల్లూ, శర్మా తిష్ఠవేశారు.

"వెంకూబాయమ్మగారు రారు వడ్డనకు" అన్నాడు అవధాన్లు.

"అమ్మో! ఎలా వస్తుంది? ఆవిడ కన్నిపన్లలో తీరిక వుండొద్దూ మరి?" అని జవాబు చెప్పాడు. శాస్త్రుల్లు.

శర్మ ఏమనాలో తేలీక వూరుకున్నాడు.

అంతలో దుర్గాబాయమ్మగారు లడ్డూలు వడ్డిస్తూ వచ్చింది. "ఇంకో రెండు. ఇంకో రెండు" అంటూ అందరి వి స్తళ్ళలో గుమ్మరిస్తూ అవధాన్ల దగ్గరకు వచ్చింది.

"ఏవండీ అవధాన్లగారూ. కావలసినన్ని వేయించు కోండి," అంటూ ఓ నాలుగు గుమ్మరించింది.

"అయ్యో, అయ్యో యిన్ని తినగలనా?" అన్నాడు అవధాన్లు.

మిగతావారికికూడా అలానే వడ్డిస్తూ వెళ్ళిపోయింది దుర్గాబాయమ్మగారు.

"ఈవిడలో యీ మార్పుకు కారణమేమిటి చెప్మా?" అనుకున్నాడు అవధాన్లు. బయటకే అన్నాడామాట.

"అదే తెలియకుండా వుంది." అన్నాడు శాస్త్రుల్లు.

"ఒకవేళ బుద్ధి తెచ్చుకుందేమో" అని సంశయం వెలిబుచ్చాడు శర్మ.

ఈసారి దుర్గాబాయమ్మ బంగాళాదుంపలకూర తెచ్చి గుమ్మరిస్తూపోయింది. ఈ మిత్రత్రయానికి కూడా వద్దన్నకొద్ది వడ్డించిపోయింది. ఈసారి వీళ్ళు యీవిడిని అభినందిస్తూ వుండే లోపలే వెంకూబాయమ్మగారి కంఠం వినిపించింది.

"ఇదిగో కొంచంచూసి వడ్డించండి దుర్గాబాయమ్మ గారూ! వస్తువును అకారణంగా ఎందుకు వృధాచేయటం? ధరలు మండిపోతున్నాయి."

"ఆ, పోనిద్దురూ పెళ్ళిళ్ళలో కాకపోతే యింకెప్పుడు యిలాచేయటం? రోజూ వస్తయ్యా పెళ్ళిళ్ళు" అన్నది దుర్గా బాయమ్మగారు.

"రోజూ రావాలటమ్మా ఒకసారొస్తే చాలదూ మన దుంపలు తెచ్చటానికి" అన్నది వెంకూబాయమ్మగారు.

"మరేం పోదులెద్దురూ" అంటూ దుర్గాబాయమ్మ గారు యింకా అలానే వడ్డించబోయింది. ఈసారి వెంకూ బాయమ్మగారికి కారాలూ, మిరియాలూ నూరినట్లయింది.

"మీకాక్కాదండీ చెప్తూంట! చేతకాకపోతే వడ్డించటం మాని కూచోండి. అసలు వాళ్ళకు తెలుస్తుంది ఆ వస్తువు కున్న విలువ. పరాయివాళ్ళకేం తెలుస్తుంది. మనసొమ్ము కాదని అలా దుబారా ఖర్చు చేసెయ్యటమేనా?" అంటూ అరిచింది గట్టిగా—

పెళ్ళి పందిరిలో అందరితోబాటూ యీ ముగ్గురు మిత్రులూ మిక్కుటంగా విస్తుపోయారు.